# సురభి

మూలం: శ్రీ గులాబ్‌దాస్ బ్రోకర్

తెలుగు సేత
సి.వి.యస్.రావు —

సురభ, ఎవరో వస్తున్నట్లు అడుగుల సవ్వడి విని, ఇంట్లోంచి గబుక్కున కాంపౌండు గేటు దగ్గరకు వచ్చింది. తోటమాలి కనబడగానే నిరుత్సాహపడి, డ్రాయింగ్ రూముకు తిరిగి వచ్చేసి సోఫాలో కూలబడి పోయింది.

ఏదో బలహీనంగా ఫీలయింది. టీపాయ్‌లో, సగం త్రాగి వదిలేసిన మంచినీళ్ల గ్లాసును పెదవులకు దగ్గరగా తీసికొంది. ఆ స్పర్శ, ఆమెలోని గతస్మృతులన్నిటిని వెలికి తీసింది. చెప్పలేని ఆనందంతో ఆమె కళ్లు మూతలు పడినై. ఎఱ్ఱని చెంపలు మరింత కెంపువర్ణము దాల్చినై. ఆ తన్మయత్వంలో ఆమె ఒళ్లు పరవళ్లు త్రొక్కింది. కాని ఇంతలోనే, ఆమె సిగ్గుతో కుంచించుకు పోయింది, తన బేలతనానికి. కళ్లు తెరచి, గబా గబా గ్లాసులోని నీళ్లు ఒక్క గుక్కలో తాగేసింది.

ఆమె మొహం కోపంతో జేగురు వర్ణముగా మారి పోయింది.

"ఛీ! సిగ్గు లేని వెధవ! ఆ మనిషికెంత ధైర్యం. తనతో అంత చొరవ తీసుకోవటానికి"

ఈ ఆలోచనల భారాన్ని భరించలేక, సోఫా లోంచి లేచి రూములో, అటూ ఇటూ పచార్లు చేయసాగింది. కాని ఆమె మనస్సు అంతకన్నా పెద్ద పెద్ద అంగలు, అన్ని విధాలుగా వేస్తూంది.

"నేను చేసిన ఆక్షేపణలు, అభ్యంతరాలు, అర్ధం లేనివని, బలహీనమని అతని ఉద్దేశము కాబోలు."

"కాని, అదేం నిజంకాదు. అతనలా ప్రవర్తించటం తనకేమాత్రము ఇష్టములేదు. నిజంగా ఆ మనిషికెంత గుండె నిబ్బరం., నేను కోపంతో చుర చుర చూస్తే, వెధవ సిగ్గు లేక నవ్వుతాడు?"

"అసలు తను చేసిన దానికి, నేను సమ్మతించిన దాన్నయితే, అక్కడ నుండి అంత త్వరగా బయట పడ్డానికి, ఇష్టపడేదాన్నే కాదుగా!"

ఈ ఆలోచన ఆమెకు కొంత వూరటనిచ్చింది.

కాని ఇంతలో మరో దురాలోచన, దాన్ని తుడిచేసి, ఆమెను మళ్లీ బాధపెట్టింది.

"నిజంగా అతనంటే నీకిష్టం లేదూ! మరి అతన్ని చూడటానికి ఎందు కలా తహతహ లాడతావు? వీధిలో ఏ శబ్దము వినపడ్డా అతనే వస్తున్నాడని భ్రమపడి, వీధిగుమ్మంలోకి ఎందుకు వెళ్తున్నావ్? అతనుకాక, ఇంకోరెవరైనా కనపడితే, ఎందుకంత నిరుత్సాహపడతావు? ఎందుకు సురభీ ఎందుకు? ఎందుకు? ఎందుకు?"

ఆమె కళ్లముందు ఒక సుందర విగ్రహము నిలచింది. అదే వంకుల నల్లని జుట్టు, అవే వాడి చూపులు— ఆ ఆకారము తన్ను అలాగే ప్రశ్నిస్తూంది. "నేను ఇంకోటి తీసుకోనా— ఒక్క మారే!" ఆమె పెదవులు వణికేయి. ఒక స్మృతి తరంగము తర్వాత మరొకటి ఆమెను వెన్నంటి, ఆమె శరీరాన్ని కొన్ని చక్కిలి గింతలు, కొన్ని బాధ పెట్టినై.

• • •

అది సాయం సమయము. అస్తమిస్తున్న సూర్యకాంతిలో ఆకసమంతా పారాణిపూసినట్లుంది. సూర్యకాంతితో కలసి వాహ్యాళి కెళ్లటం, ఆమె కదే మొదటిసారి. బయల్దేరేటప్పుడు ఎంతో దూరము వెళ్లాలని అనుకోలేదుగాని, ఆ విషయము, ఈ విషయము మాట్లాడుతూ, తామెంత దూరము వచ్చేరో, సముద్రపుటొడ్డుకు వచ్చే వరకు వారికి తెలియనేలేదు. అస్తమిస్తూన్న సూర్యున్ని చూసి, ఆమె వెంటనే ఇంటికి తిరిగి వెళ్లి పోవడానికి నిశ్చయించుకొంది. ఆమె చెప్పే లోగా సూర్యకాంత్ "ఈ సూర్యాస్తమయాన్ని కొంచెంసేపుచూద్దామా!"

"వద్దు! సూర్యకాంత్! ఇప్పటికే చాలా ఆలస్యమయింది"

"కొన్ని నిముషాలేగా! ఇంతలోనే ఏమాలస్యమవుతుంది.?" మరుక్షణమే అతను, ఇసుక మీద కూల బడ్డాడు. తన స్త్రీ సహజ స్వభావంతో, ఆమె చుట్టూ కలియజూసింది. ఇలాపరపురుషునితో తను ఒంటరిగా ఉండటం, ఆమెకు మనస్కరించలేదు. ఆ ప్రదేశమేమీ ఏకాంత స్థలము గాదు. కొన్ని గజాల దూరంలో అక్కడక్కడ, కొద్ది కొద్దిగా మనుష్యులు ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు.

సురభి, సూర్యకాంత్‌కు, రెండు, మూడు అడుగుల దూరంలో కూర్చుంది. కాని ఆమె మనసులో ఝంఝామారుతము రేగుతూంది.

"దీన్ని చూసి, మావారు ఏమనుకొంటారు! ఇటువంటివి వారికి గిట్టవు. కాని, ఇంతకూ సూర్యకాంత్, వారికి సన్నిహితుడే కదా! ఇంతకూ తను చేసిందానిలో తప్పేమున్నది"

• • •

క్రమంగా సూర్యుడు అదృశ్యమయ్యాడు. పున్నమినాటి చంద్రుడు తన నిండు శోభతో తారలను కలుసుకునేందుకు, వంగివి లొంగి చూశాడు. ప్రకృతంతా వెన్నెలతో నిప్పబడింది. వాతావరణమంతా చల్లగా ప్రశాంతంగా వున్నది.

ఉన్నట్లుండి సూర్యకాంత్ అన్నాడు "సురభీ! నీవు బాగా పాడతావటగా?"

'నీకెలా తెల్సు"

'ఒక దేవత నాకు చెప్పింది. నిజమేనా'

'అంతా' పచ్చి అబద్దం. నాకు పాడటమేరాదు." నవ్వకుండా ఉండలేకపోయింది. ఆ నవ్వులు కిలకిల 'నీవు చెప్పింది పచ్చి అబద్దం' అని అన్నాయి.

సూర్యకాంత్ ఆమెకు దగ్గరగా జరుగుతూ, ఆమె కళ్లలోకి చూస్తూ 'ఒక్కపాట పాడు, నీవు గాయకివి అవునో కాదో చెప్తాను." ఆ చూపుల అర్ధమేమిటో, ఆమెను భయపెట్టినై.

అయితే సూర్యకాంత్ తనను ఇలా చూడటం ఆమెకు క్రొత్తేమీ కాదు. సూర్యకాంత్ ప్రతి రోజు వారింటికి వచ్చేవాడు. అప్పుడప్పుడు ఆమె భర్త, వారిద్దరిని ఒంటిగా వదిలేసి, మేడ మీది కెళ్లి పోయేవాడు. కాని ఆ నాల్గుగోడల మధ్య తనకెంతో రక్షణ ఉండేది. సూర్యకాంత్‌ను చూసి భయపడేదికాదు. కాని ఇప్పుడా రక్షణ ఇక్కడ లేదు. చీకటి పడింది. చుట్టూనున్న చాలామంది జనం వెళ్లి పోయారు. సురభికి ఎందుకో బెదురుగా ఉంది. అతను తనకు అంత దగ్గరగా— ఏకాంత సమయము— ఏమవుతుందో ఏమో!—

'రా సూర్యకాంత్! ఇంటికెళ్దాం పద! ఆలస్యమవుతుంది"

సురభి మళ్లీ వేడుకొంది. కానీ సూర్యకాంత్‌లో చలనమేమీలేదు.

"నీవు పాటపాడే వరకు, నేనిక్కడ నుండి కదలను. నీవు చాలా శ్రావ్యంగాపాడతావని విన్నాను"

"ఏమిటీ మొండితనం! నేను వెళ్లాలి" లేవబోయింది సురభి.

"మొండితనమేమీలేదు. నీవు చెప్పినట్లు నేను వినాలంటే నీవు తప్పక పాడి తీరాలి మరి"

అంటూ సురభి చేతులు పట్టుకొని కూర్చోబెట్టేడు.

అతని నిశ్చయాన్ని చూసి, తనింక పాడక తప్పదని తెల్సుకొంది. ఏ పాట పాడదామా అని ఆలోచిస్తూండగా, తన వేళ్లను అతను తన చేతుల్లోకి తీసుకొని "అమ్మాయిలకు మరీ ఇంత కఠిన హృదయముండకూడదు" అని మృదువుగా అన్నాడు.

సురభి తను వెళ్ళేసి, అతని చేతుల్లోంచి తీసుకొంది.

"అయితే ఏ పాట పాడమంటావు?" సురభి ఆశ్చర్యంగా ప్రశ్నించింది. "నీకాపాట వచ్చు కదా! 'నీకన్నుల్లో మెరిసే ఆ ప్రేమజ్యోతి'" వచ్చునట్లు తలూపింది.

'అది పాడు మరి !'

కాంత్ కోరిన ఈపాట పాడటం ఆమెకిష్టం లేదు. అది ప్రేయసి, ప్రియుణ్ణి చూస్తూ పాడేపాట తను పాడనంటే మరీ మొండికేస్తాడు. మరీ ఆలస్యమౌతుంది! ఇంటికి ఎంత త్వరగా వెళ్తే అంత మంచిదని పాడటానికి నిశ్చయించుకొని, గొంతు సవరించుకొని, పాడసాగింది.

సహజంగా ఆమె కంఠం శ్రావ్యమైనది. ఆ మనోహర గీతానికి ఆ ప్రశాంత వాతావరణము తోడ్పడింది. తన గానమాధుర్యంలో తనే లీనమై పోయింది. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

'సురభీ! శూన్యంలోకి చూస్తూ పాడుతావెందుకు! నావైపు తిరుగు. నీ కళ్లల్లో రగిలే జ్వాలల్ని చూడనీ! నీకన్నుల్లోనాట్యమాడే ప్రియురాల్ని వీక్షించనీ, ప్లీజ్;"

సురభి అచేతనంగా కాంత్‌ని చూసింది. అతనే మత్తెక్కిన కళ్ళతో తన్ను చూసినవ్వాడు. క్రమంగా పాట నిశ్శబ్దంలో కలసి పోయింది. తను తిరిగి అతని వైపు చూసే సరికి అతని కన్నుల్లో తారలు ప్రకాశిస్తున్నాయి. కాంత్ అన్నాడు.

"ఎంత అద్భుతంగా పాడావు! నీకంఠంలో మధువుంది. నేను నిన్నెలా సత్కరించాలి! నీకే పురస్కారమివ్వాలి"

'నాకేమి బహుమతినివ్వనక్కర్లేదు. ఇంటికెళ్దాం పద, ఇప్పటికే చాలా వేళయింది".

"కాని నేను మెచ్చుకు, నీ గాన విశిష్టతకు మెప్పుగా బహుమతి నివ్వకుండా నిన్ను వెళ్లనివ్వను"

అతని చిన్నపిల్లవాని వాలకము చూసి "అయితే ఏమి పురస్కారమిస్తావేమిటి" అనడిగింది.

'ఇదీ' అంటూ, ఆమెను హృదయానికి దగ్గరగా లాక్కొని ఒక్క క్షణం ఆమె పెదాలను— ముద్దు పెట్టుకొన్నాడు.

ఒక్క మారుగా ఆమె అచేతనురాలైంది. ఏమి జరిగిందో కూడా వూహించలేక పోయింది. ఈ షాక్ లోంచి తేరుకుని, ఈ సంఘటన ఎవరైనా చూశారేమోనని చుట్టూ చూసింది. ఇప్పుడే తమ దగ్గరగా వెళ్లిన వారిద్దరు చూడలేదు కదా! ఆమె నుదుట, అంత చల్లని వాతావరణములోను, స్వేద బిందువులు వచ్చినై.

కోపంగా అతన్ని విదిల్చించుకొంది.

"సిగ్గులేని వాడా! ఎంత సాహసం"

"నాకెందుకు సిగ్గు లేదు?" ఆమె గాభరాతనానికి నవ్వుతూ అమాయకంగా అడిగేడు.

"నీవిందుకే పాడమనేటట్లుంటావే అసలు పాడేదాన్నికాదుగా. మనిషికెంత ధైర్యం? ఇంత చొరవ తీసుకోవటానికి! ఛీ!"

"నిజంగా నీకు అయిష్టమా! నిజం చెప్పు. నిన్ను మరోమారు ముద్దు పెట్టుకనా! ఒక్క మారు! అప్పుడు తెలుస్తుంది నీకు ఇష్టమవునో కాదో" అతను నవ్వుతూ మళ్లీ అడిగాడు.

'నీకు నిజంగా మర్యాద తెలియదు!' కోపంతో ఆమె ఒళ్లు దహించుకు పోతూంది. "ఛీ! నాతో ఇంకెప్పుడూ మాట్లాడకు!" అంతే! లేచి విసురుగా వెళ్లిపోయింది అతన్ని వదిలేసి. కానిఅతను ఆమె వెంటే బయల్దేరాడు. ఇంటి కొచ్చేవరకు ఎవ్వరూ మాట్లాడలేదు.

ఇంటి దగ్గరకు రాగానే కాంత్ "ఇప్పుడు దీన్ని గురించి ఏమనుకొన్నా, ఈరోజు నీకెప్పుడూ జ్ఞాపకముంటుంది. అయినా! నీకు పెద్దగా ఇది అయిష్టమేమీ కాదుగా, నిన్ను మళ్లీ త్వరలో కల్సుకొంటాను! చీరియో!"

అతని వైపు చూడటానికి కూడ ఆమెకు అసహ్యమేసింది.

• • •

ఇంతలో వీధిలో మెల్లిగా చప్పుడైనట్లు వినపడింది. ఆమె ఊహా పరంపరలకు అంతరాయం కల్గించింది. బయటకు వెళ్లకూడదని నిశ్చయించుకున్నా, వెళ్లకుండా ఉండలేక పోయింది. సురభి గుమ్మం దగ్గరకు వచ్చింది: ఒక కుక్క వరండాలో తారట్లాడుతూంది. నిరాశ చెంది లోపల కెళ్లి సోఫాలో కూర్చుంది. 'ఎలాంటిదాన్ని నేను. ఇంత చేసినా కూడా, అతనికోసం అంత తహతహలాడుతానేమిటి? ఆ సాయంకాలము అంత అసభ్యంగా ప్రవర్తించినా, ఇంకా అతనికోసం నిరీక్షిస్తానేమిటి? బహుశా అందుకోసమేనేమో ?" సురభి ఆ పాడు ఆలోచనల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించి, నిష్ఫలురాలైంది.

"నా భర్త కూడా నాలో కలిగే మార్పును గ్రహించారు. నిన్నవేగానన్నడిగారు "ఏమిటి సురూ! ఎవరి గురించేమిటి అంత దీర్ఘముగా ఆలోచిస్తున్నావ్"......... ఓ దైవమా!"

నేను నిజాన్నెంత బాగా కప్పి పుచ్చాను. "మిమ్మల్నిగాక మరెవర్ని తలుస్తాను. ఎంత పాపిష్ఠిదాన్ని"

సిగ్గు నీడ ఆమెను కప్పేసింది. 'ఛీ! ఇంకా కాంత్‌ను గురించే తలుస్తానేమిటి— అతన్ని చూడాలని ఇంకా ఉబలాటపడతానేమిటి! కాని ఆ సమయంలో, ఎంత రొమాంటిక్‌గా ఉన్నాడు. మనిషితో ఎంత చొరవ. ఆతని కళ్లు .... అబ్బా!'

మళ్లీ వీధి గుమ్మంకు దగ్గరగా ఎవ్వరో వస్తున్నట్లు అలికిడి అయింది. కాని సురభి కూర్చున్నది లేవలేదు. "ఎవరొస్తే నాకేమి!" అనుకొంది. ఆ అడుగుల చప్పుడు మరింత స్పష్టముగా వినిపించింది. సురభికి కలవరమెక్కువైంది. "అతనే! సూర్యకాంత్! ఓ! గాడ్!" సురభి గబగబా సోఫాలోంచి లేచి రేగిన జుట్టు సవరించుకొంది. చీర కుచ్చెళ్లు సరిదిద్దుకొంది, వేగంగా కొట్టుకొనే గుండెలతో అతని రాకకోసం నిరీక్షిస్తూంది.

సుపరిచితమైన కంఠం వినపడింది.

'పోస్ట్! అమ్మగారు!

నిర్జీవంగా వెళ్లి కవరు తీసుకొంది. అడ్రసు తన భర్తపేరిట ఉంది. కవర్ మీద 'ప్రైవేట్ కాన్ఫిడెన్షియల్' అని వ్రాసి ఉంది. ఒక్కమ్మడిగా ఎవ్వరో గొంతు నులిమి చంపినట్లు భయవిహ్వలయింది. 'తన భర్తకు అంత రహస్యంగా ఉత్తరాలు రాసే దెవరు? ఆరోజు ఆ దృశ్యాన్ని చూసిన వాళ్లిద్దరు రాయలేదు కదా! బహుశా వారు, నాభర్తకు పరిచితులేమో!"

ఉత్తరాన్ని వెలుతురులోకి తీసికెళ్లిచూసింది. ఎవరు రాసేరో కనబడుతుందేమోనని. లాభం లేక పోయింది. చివరకు పోస్టాఫీసు వాళ్లు కూడా తన భర్తతో సహకరించినట్లుగా, పోస్టల్‌ముద్ర కూడ అంత తేలిగ్గా పడ్డది.

గడియారం ఐదు గంటలు కొట్టింది. ఇంకో గంటలో వారు ఆఫీసు నుండి వస్తారు. ఇంకో గంటలో, తనెంత చంచల స్వభావురాలో బయట పడుతుంది. తను చేసిన మోసము తెలిసిపోతుంది. ఇంకో గంటలో తను ఇన్నాళ్ళు ఈ గృహములో పొందిన గౌరవము, ఆదరణ అంతా కోల్పోతుంది." ఒక కన్నీటి బిందువు ఆమె చెంపల మీదుగా జారింది. తనకు పెళ్లయిన ఏడాదిన్నర నుండి, రోజులు ఎంత మధురంగా గడచి పోయాయి. వారు ఎప్పుడూ పరిహాసానికైనా పల్లెత్తు మాటనలేదు. ఎంత సాధు స్వభావులు? కాని, మరో గంటలో, తన జీవితము సర్వనాశనమయి పోతుంది!'

• • •

భర్తకు తన మొహం ఎలా చూపించాలి ! ఎంత ఘోరవిపత్తు కలిగినా చలించని స్వభావమతనిది.

"సురభీ! సురూ! ఎందుకలా చేశావు! నా ఇంటి గౌరవమంతా నీ మీదే పెట్టేను కదా! నీవే నా సర్వస్వమని నమ్మానే! సురూ! ఎంత పనిచేశావు? సురూ ఎంత పనిచేశావు?" అని మెల్లిగా మందలిస్తే!

తానా మందలింపు భరించలేదు. ఉత్తరము వైపు మరోమారు చూసింది. అది చించిపారేస్తే! మొదటి దానిలోని విషయాలు తను తెలుసుకోవాలి. తర్వాత దాన్ని నాశనం చేయాలి. కాని అది ఆఫీసుకు సంబంధించిన కాగితమేమో !

ఛీ! తనెంత నీచపు పనికి తలపెట్టింది. వారెప్పుడు తన పెర్సనల్ ఉత్తరాలను, చదవనన్నా లేదే! ఇప్పటికి తను చేసిన ద్రోహము చాలక, ఇంకా ఎక్కువ ద్రోహము తల పెట్టాలా! దూరంగా అల్మారలోకి ఉత్తరాన్ని గిరాటువేసింది.

హమ్మయ్య! గోరంతదాన్ని కొండంత చేస్తున్నాను. ఆ సాయంకాలము కనబడ్డ వాళ్లిద్దరూ, వారికి తెలుసుంటే తనకి తెలియాలి కదూ!

మళ్లీ సూర్యకాంత్ ఆమె తలపుల్లోకి వచ్చాడు. కాని వెంటనే ఆమె ఆలోచనల్ని భర్త మీదికి మరల్చింది. ఇద్దరి ఆకారాలు ఆమె మనోదృశ్యపథము ముందు మెదిలాయి. ఒకర్ను రొమాంటిక్‌గాను, చిలిపిగాను, చూసి నవ్వుతున్నారు. ఇంకొక

రిలో కరుణ, సాధుత్వము, అనురాగము తొంగి చూస్తున్నాయి. ఒకరి చూపులో పశుత్వమున్నది. ఒకరి చూపులో తనంటే ఆప్యాయత తొంగి చూస్తూంది.

''దైవమా! ఏమిటీ పరీక్ష' సురభి నిట్టూర్పు విడిచింది.

సోఫాలోంచి లేచింది, ఇంటి పనులు చేసుకోవ డానికి, వంటింట్లోకి వెళ్ళింది.

ఆరున్నర కావస్తూంది. ఇంకా వారు రాలేదు. రోజూ ఈ పాటికి తిరిగి వచ్చేవారే! ప్రతినిముషం ఒక యుగంలా వుంది.

ఆరున్నర......ఏడు.. ..ఏడున్నర .... ఈరోజు ఇంత ఆలస్యమవటానికి కారణమేమిటి? దారిలో ఎవరైనా వారి చెవిలో వార్త వడే శారా! ఇలాంటి పరిస్థితుల్లో ఇంకొకరైతే, భార్యను ఇంట్లోంచి వెళ్ళ గొట్టేవారో కాని తన భర్త, తను చేసిన తప్పుకు వారే శిక్షననుభ విస్తారు. వారే బాధ పడతారు. అంతటి దయా ర్ద్రహృదయము వారిది.

కన్నీటి బిందువులు ఆమె చెంపల్ని ఆర్ద్రము చేసినై.

'ఓ దైవమా! వారికెట్టి ఆపదా కలగకుండా చేయి, ఇంక నేను వారికెట్టి ద్రోహము తల పెట్టను'' దేవుణ్ణి మరి మరి వేడుకొంది.

ఎనిమిది పది హేను..... ఎనిమిదిన్నర...... తొమ్మిది. సురభి తను చేసిన అర్థంలేని ప్రవర్త నను పరిపరివిధాల బాధతో సిగ్గుతో కుంచించుకు పోయింది.

''ఓ ప్రభూ! వారికెట్టి అపాయము కల్గ కూడదు. జరిగినదంతా వారికి చెప్పితీరాలి! వారేశిక్ష వేసినా, నేను అనుభవిస్తాను. ఇంట్లోంచి బహి ష్కరించినా వెళ్తాను వారి గౌరవము కోసము'. సురభి తగిన శిక్షను అనుభవించటా నికి నిశ్చయించుకొంది.

• • •

సుపరిచితమైన అడుగుల చప్పుడు ఆమె ఆలోచనలకంతరాయము కల్గించింది. వారే! సిగ్గుతో నిండిన కన్నీళ్ళను తుడుచు కోవడానికి బాత్‌రూమ్‌లోకి ముఖము కడుక్కోవ డానికి, త్వరగా వెళ్ళి వచ్చింది.

వారు ఎంతగానో అలసిపోయారు. ఎలాగో ఆమె నోట్లోంచి మాటలు వెలువడినై 'ఏమండీ ఇంత ఆలస్యమయిందే!' కుర్చీలో కూర్చుంటూ ''ఆఫీసులో వూపిరాడనిపని. అంతా అర్జంట్!'' అతను బరువుగా కళ్ళు మూసుకున్నాడు.

నిశ్శబ్దాన్ని భరించలేక పోయింది. ఆమె తనూహించినట్టు వీరికి జరిగిందంతా తెలిసి పోయిందని అనుమాన పడ్డది. అయినా నిజాన్ని ఎదుర్కోవాలి. తను చేసిన తప్పిదానికి శిక్షననుభ వించాలి.

అతను కళ్ళు తెరచి చిరునవ్వుతో 'రా సురూ! వడ్డించు! భోం చేద్దాం!'' అన్నాడు.

''వెళ్ళి ముఖము కడుక్కోండి! వడ్డిస్తాను.'

ఆమె అంతరాత్మ ప్రశ్నించింది ''నీ తప్పుకు ప్రాయశ్చిత్తము మాటేమిటి.' సురభీ!'' సురభి కొద్ది క్షణాలు వూరుకొన్నది. ధైర్యాన్ని కూడ బలుక్కుని ''ఏమండీ! మీకో ముఖ్యవిషయము చెప్పాలి! భోజనము తర్వాత చేద్దామా!''.

''అలాగే! ఏమిటది సురూ!''

అంతే! ఎంత ప్రయత్నించినా నోట్లోంచి మాటపెగల్లేదు. ఎంత ప్రయత్నించినా గొంతు కదల్లేదు.

''ఏమిటి సురూ!''

''ఏమీ లేదు! మీకో ఉత్తరము వచ్చింది'' అల్మారాలో పారేసిన ఉత్తరము తీసి ఇచ్చింది. ఆమె హృదయస్పందన తప్ప ఆమెకు మరేశబ్దము వినబడలేదు. అతను ఉత్తరం చించి మౌనంగా ఉత్తరం చదువుతున్నాడు. సురభి అతని పాదాల దగ్గర వాలిపోయి, అతని కళ్ళవైపే చూస్తూ ఉండి పోయింది. వారి ముఖంలో ఏ మార్పు గోచరిస్తుందోనని భయముతో వణికి పోయింది. ఉత్తరం చదివిన పిమ్మట ''ఎప్పుడూ ఎవడో ఒకడు . . .'' విసుగ్గా అన్నాడు.

సురభికి వూపిరాడలేదు. తను వూహించి నదే. 'తనకు తెలిసినదే . . . ఆ ఉత్తరంలోని విశేషము.

''సురభీ! మనమెందరికి సహాయము చేయ గలము! కాంత్‌కి డబ్బుకావాలిట''

''అంతేనా! కాంత్ ఇంకే విషయాలు రాయ లేదూ!'' జాగ్రత్తగా అడిగింది.

''ఇంకేం ముఖ్యవిషయాలు లేవు'' ఆమె కళ్ళు ఎందుకో బెదురుతున్నట్లున్నాయి అతనికి. ఆమె భుజాల్ని నిమురుతూ.

''ఏమిటి సురూ! ఎందుకలా భయంతో వణకుతున్నావ్. దేన్ని చూసి భయపడుతున్నావ్'' అతని మాటల్లో అనురాగము పెల్లుబికింది. ఆ అనురాగ వచనాలే ఆమెకి తృప్తినిచ్చినై. ఒక్క సారు ఆమెలో దుఃఖం పొంగి పొర్లింది. అతని తొడలమీద తలపెట్టి వెక్కివెక్కి ఏడ్చింది. ఆమె చుబుకాన్ని పైకెత్తి ''ఏమిటి సురూ! ఎందుకేడుస్తున్నావ్''.

అతని కళ్ళలోకి ప్రేమగా చూసింది. ఇదే మంచి సమయము. జరిగింది తను చెప్పితీరాలి. కాని మాటలు కంఠంలోనే ఉండిపోయాయి. కన్నీళ్ళే పెద్ద ముత్యాల్లాగాఆమెచెక్కిళ్ళమీదుగాజారినై. అతను మరింత గాభరా పడ్డాడు. ఆమె జుట్టును, చెంపల్ని ఆప్యాయంగా, మృదువుగా రాస్తూ ''నాకు చెప్పవా! సురూ! నన్ను నమ్మవా! నీకొచ్చిన ఆపదేమిటి ?'' తనంటే పొంగుతున్న అతని ప్రేమ, అభిమానం ఆమెని ఉక్కిరి బిక్కిరి చేసినై. అతన్ని గాఢంగా కౌగలించుకొంది. చివరిసారిగా ఆమెనోట్లోంచి మాటలు పెగిలినై ''మీరు ఇంటికిత్వరగ వస్తారనుకొన్నాను. ఇంత ఆలస్యమైతే, ఎంత బెంగపడ్డా ననుకొన్నారు!''

